## మంత్రి పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్



కోస్గి ప్రభుత్వ దవాఖానను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

కోస్గి, అక్టోబర్ 3: కోస్గి మండలంలో బుధవారం ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు పర్యటన సందర్భంగా అధికారులు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. మంగళవారం ఆయన కోస్గి పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన, హెలిప్యాడ్, కాలేజ్ గ్రౌండ్‌లోని బహిరంగా సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శేఖర్, ప్రభుత్వ వైద్యులు అనుదీప్, సీఐ జనార్ధన్, ఎస్సైలు శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మోస్తరు వర్షం

నారాయణపేట, అక్టోబర్ 3: జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. దామరగిద్ద మండలంలో 19.4 మిల్లీమీటర్లు, నారాయణపేటలో 1 మి.మీ, ధన్వాడ 4.2 మి.మీ, మద్దూర్ మండలంలో 7.0 మిమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

## వర్షానికి కూలిన మట్టి ఇళ్లు



కూలిన ఇల్లు

ధన్వాడ, అక్టోబర్ 3 : మండల కేంద్రానికి చెందిన సంజీవరెడ్డి ఇళ్లు కూలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి దెబ్బతిన్న మట్టి ఇళ్లు మంగళవారం కూలినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇళ్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఈ విషయమై తాసీల్దార్ కార్యాలయంలో సమాచారం ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకుడు కందురి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబానికి గృహలక్ష్మి పథకం మంజూరు చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## ఎస్సీ ఉపకులాల మండల కమిటీ ఎన్నిక



ఉపకులాల కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

మూసాపేట, అక్టోబర్ 3 : ఎస్సీ ఉపకులాల నూతన మండల కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు సమక్షంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఉపకులాల సభ్యులతో మూసాపేటలో సమావేశం నిర్వహించి నూతన మండల కమిటీని ఎంపిక చేశారు. మండలాధ్యక్షుడిగా గగనం మన్యం, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహ, కోశాధికారిగా బుడగజంగం స్వామి, కార్యదర్శులుగా రామాంజనేయులు, వెంకటయ్య, మన్యం, చంద్రయ్య, చిన్నవెంకటయ్య, ఆంజనేయులు, సుదర్శన్, బాలచందర్, రవి, సురేశ్, వెంకట్రాములు, సుందరయ్య, భద్రయ్య, బురాన్‌లను ఎన్నుకున్నారు.

# గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- క్రీడా కిట్ల పంపిణీ



క్రీడా కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్ టౌన్, అక్టోబర్ 3: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మక్తల్ మండల వనరుల కేంద్రంలో ఎమ్మెల్యే మక్తల్ మండలంలోని 41 క్రీడా ప్రాంగణాలకు క్రీడాకిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కేసీఆర్ ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారన్నారు. క్రీడా ప్రాంగణాల్లో ఎంతో మంది క్రీడాకారులు క్రీడల్లో మెళకువలు నేర్చుకుంటున్నరని వారి కోసమే ప్రభుత్వం క్రీడా కిట్లు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీవైఎస్‌వో వెంకటేశ్, ఎంపీడీవో సద్గుణ, అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, ఆశకార్యకర్తలు ఎమ్మెల్యే చిట్టెంకు మంగళవారం ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన ఆశ కార్యకర్తల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

## మంత్రి హరీశ్ రావు సభను విజవంతం చేయాలి

మక్తల్ అర్బన్, అక్టోబర్ 3: మక్తల్ లో నిర్వహించే ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు బహిరంగసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో కోరారు. బుధవారం మక్తల్ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన మక్తల్ వెల్‌కం బోర్డు , మక్తల్ పట్టణంలో రూ.34కోట్లతో 150 పడకల ప్రభుత్వ దవాఖాన, కృష్ణ మండల కేంద్రంలో రూ.1.2 కోట్లతో పీహెచ్‌సీ బిల్డింగ్, మక్తల్ పట్టణంలో రూ.2.50 కోట్లతో ఫైర్‌స్టేషన్, రూ.6 కోట్లతో వేర్‌హౌస్ బిల్డింగ్, రూ.5 కోట్లతో కేజీబీవీ, రూ.6 కోట్లతో గుడిగెండ్ల, కర్ని, కన్సనూర్, ఒబ్లపూర్ లో నిర్మించనున్న నాలుగు సబ్‌స్టేషన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభకు మక్తల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజవంతం చేయాలని కోరారు.

### తరలిరావాలి

నర్వ, అక్టోబర్ 3: మక్తల్ పట్టణంలో బుధవారం నిర్వహించనున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలి రావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల అనంతరం ఏర్పాటు చేసే బహిరంగ సభకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకట్‌రెడ్డి, దండు అయ్యన్న, శంకర్, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల రక్షణకు పోస్టుకార్డు ఉద్యమం

నవాబ్‌పేట, అక్టోబర్ 3 : తల్లి దండ్రుల రక్షణ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరుతూ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో మంగళవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు, సీనియర్ సిటిజన్లు తదితరులు ప్రధానమంత్రికి పోస్టుకార్డులు రాసి పోస్ట్ చేశారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు నాగభూషణం, నర్సింహులు, వెంకటేశ్వరప్ప, సత్యనారాయణ, వేణునాథం తదితరులు పాల్గొన్నారు.



పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

# సంతలో సెల్‌ఫోన్ దొంగలు

మూసాపేట, అక్టోబర్ 3 : మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే కూరగాయాల సంతలో సెల్‌ఫోన్‌ల దొంగలు పెట్రేగి పోతున్నారు. మూసాపేట సంతకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి కూరగాయల వ్యాపారస్తులు, రైతులు, కొనుగోలుదారులు వస్తుంటారు. దీంతో సంత రద్దీగా ఉంటుంది. వచ్చిన వారు కూరగాయాల కొనుగోలు చేయడానికి నిమగ్నమైన సమయంలో జెబులో ఉన్న సెల్‌ఫోన్‌లను కొట్టేస్తున్నారు. ప్రతి సంతలో ఒకటి రెండు సెల్‌ఫోన్‌లు పోతున్నట్లు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అయితే మంగళవారం కూడా తిరుపతయ్యగౌడ్ సెల్‌ఫోన్‌ను జెబులో నుంచి కొట్టేశారు. అతను చూసుకొని వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ప్రతి సంతలో సెల్‌ఫోన్‌లు పోతున్నా నిఘా పెట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సెల్‌ఫోన్ల దొంగల చేతివాటానికి పంట పండుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని సెల్‌ఫోన్ దొంగలను పట్టుకోవాలని బాధితులు కోరుతున్నారు. అయితే ఇటీవల ఎస్సైగా వచ్చిన శ్రీనివాసులు వచ్చిన తర్వాత గతంలో పోయిన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించడంతో పోయిన ఫోన్లను కూడా లభించే అవకాశం ఉందని బాధితులు నమ్మకం ఉందని చెప్తున్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నారాయణపేటరూరల్, అక్టోబర్ 3: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పేట మండలం లోని అమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాసరి నర్సింహులు(30) గత బుధవారం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనలో గాయపడ్డ మరో వ్యక్తి పాలమూరు జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నామని తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

బాలానగర్, అక్టోబర్ 3 : మండలంలోని అమ్మపల్లి గ్రామానికి చెందిన వినోద్ రోడ్డు ప్రమాదంలో గాయాపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆటో యూనియన్ డ్రైవర్లు మంగళవారం ఇంటికి వెళ్లి పరామర్శించి, రూ.13,600లు వినోద్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, మంజు, లక్ష్మారెడ్డి, కేశవులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పింఛన్లు అందజేయాలి

అమరచింత, అక్టోబర్ 3 : పీఎఫ్‌తో సంబంధం లేకుండా అర్హులైన బీడీ కార్మికులందరికీ ఆసరా పింఛన్లు అందజేయాలని ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సామేల్, కార్యదర్శి రాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు పట్టణంలోని మార్క్స్ భవనం నుంచి బీడీ కార్మికులతో ర్యాలీగా వెళ్లి తాసీల్దార్ షేక్‌చాంద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకులు కురుమన్న, ప్రేమరత్నం, పెద్దఎత్తున మహిళా బీడీ కార్మికులు ఉన్నారు.

## నల్లచట్టాలను రద్దుచేయాలి

అమరచింత, అక్టోబర్ 3 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని, అలాగే రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని సంయుక్త కిషన్ మోర్చా నాయకులు రాజన్న, వెంకటేశ్, అజయ్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో పీఎం మోదీ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎస్‌కేఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

## బీఆర్ఎస్ పాలనలో గ్రామాలాభివృద్ధి

మదనాపురం, అక్టోబర్ 3 : గ్రామాలాభివృద్దే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని సర్పంచ్ పద్మమ్మ తెలిపారు. మండలంలోని శంకరమ్మపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని మంగళవారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తండాలు, చిన్న గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో మారుమూల గ్రామాల్లో సైతం ఎంతో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో పుష్ప, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ కృష్ణ, సురేశ్‌కుమార్, కృష్ణయ్య పాల్గొన్నారు.